

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లి విద్యార్థిని



ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లె విద్యార్థిని తన్మయ ఎంపికైంది. సెప్టెంబర్ నెలలో నాయుడుపేటలో జరిగిన అండర్-16 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తన్మయ పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ 18వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అనంతపురం ఆర్‌డిటిలో నిర్వహిస్తున్న టైర్1 జాతీయ జూనియర్ బాలికల ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున తన్మయి పాల్గొంటారని జిల్లా అధ్యక్ష కార్యదర్శి దిలీప్‌కుమార్, మురళీధర్, తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులు మురళీమోహన్‌రాజు, విజయలక్ష్మి, స్కూల్ గేమ్స్ ఉపాధ్యక్షుడు జాన్ కమలేష్, జి.సాగర్, సంయుక్త కార్యదర్శులు మహేంద్రనాయక్, క్రీడా భారతి కార్యదర్శి నరేష్‌బాబు, కోచ్‌మహేంద్ర, అభిలాష్ అభినందించారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- 21.815 కిలోల గంజాయి పట్టివేత
- ముగ్గురు నిందితులు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ధీరజ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గంజాయి అక్రమ రవాణా చేస్తే ఉక్కు పాదం మోపుతామని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు నిందితుల నుంచి దాదాపు రూ.6.3 లక్షలు విలువ చేసే 21.815 కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గతంలో ఇద్దరు నిందితులపై మూడు చొప్పున గంజాయి కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. వీరు గంజాయి కొనుగోలు చేసి మదనపల్లి పరిసర ప్రాంతాల్లో వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు. అన్నమయ్య జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చే లక్ష్యంతో పోలీసులు విస్తృత ఆపరేషన్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి అలవాటు ఉన్న 20 మంది విద్యార్థులను సత్ప్రవర్తన, మార్పు కోసం చిత్తూరులోని పునరావాస కేంద్రానికి తరలించామని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అణిచివేసేందుకు, యువత భవిష్యత్తును రక్షించేందుకు అన్నమయ్య జిల్లా పోలీసులు కట్టుబడి ఉన్నారని గంజాయి అక్రమ రవాణా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర, తాలూకా సిఐ కళా వెంకటరమణ, ఎస్‌ఐలు అన్సర్, రహీం, దిలీప్, పోలీస్ సిబ్బంది వెంకటేష్, పురుషోత్తం, చక్రి, రమణ, భద్రా, లక్ష్మీనారాయణ, రవి నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ప్రజాశక్తి-రాజంపేట

ఈ నెల 15, 16వ తేదీలల్లో ఒంగోలులో జరుగు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎ.రామాం జులు, జిల్లా ఉపాధ్యక్షులు సి.రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ సమస్యల మీద ప్రతి సంవత్సరం రాజీ పడకుండా పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. రూ.3వేల నుంచి రూ.21 వేతనం యూనియన్ అండతో పోరాటాలు చేసి సాధించుకున్నామని చెప్పారు. మట్టి ఖర్చులు వస్తున్నాయని స్కిల్డ్ సెమీ స్కిల్డ్ వర్కర్స్‌కు ఇంజినీరింగ్ విభాగం వారికి రూ.3500 వేతనం పెరిగిందంటే కారణం యూనియన్ నిరవధిక పోరాటాలే కారణమన్నారు. రెగ్యులర్ చేస్తామన్న పాలకుల హామీల కోసం, హక్కుల సాధన కోసం సమాన పనికి సమాన వేతనం పొందాలంటే మరో పోరాటానికి యూనియన్ ఆధ్వర్యంలో నాంది పలకాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కొత్తగా పని గంటలు పెంచి కార్మికులకు కష్టాలు పెంచుతున్నదని, మహాసభలో మున్సిపల్ వర్కర్స్ ఎదుర్కొనే స్థానిక, జిల్లా సమస్యలను చర్చించి రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికి పాలకుల మీద ఒత్తిడి తేవడానికి దీర్ఘకాలిక ప్రణాళిక తయారు చేస్తారని తెలిపారు. మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.రమణ మాట్లాడుతూ జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి, బి.కొత్తకోట మున్సిపల్ వర్కర్స్ సకాలంలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మిదేవి, ఎంవి.రమణ, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిద్దాం : 'చింతల'



కోటి సంతకాల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

కోటి సంతకాలతో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వ్యతిరేకిద్దామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఉద్ఘాటించారు. శుక్రవారం మండలంలోని పాతకోటపల్లె, జమ్మళ్లపల్లె, విఠలం గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో గ్రామీణ, పేద పిల్లలకు ఉన్నత వైద్య విద్యను, ఉన్నత వైద్యాన్ని అందుబాటులోకి తేవాలనన్న సంకల్పంతో అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకువస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ కళాశాలలను వారపు సంతల్లో సరుకులు అమ్మినట్లు ప్రయివేట్ యాజమాన్యాలకు అప్పగించేందుకు చర్యలు చేపడుతోందని విమర్శించారు. ఈ కళాశాలల నిర్మాణాలను పూర్తిచేసి, ప్రారంభించడానికి ప్రభుత్వానికి కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే అవుతుందని, సీఎం, డిప్యూటీ సీఎంల హైదరాబాద్ పర్యటనలకు, నివాసాల ఏర్పాటుకు రూ.వేలాది కోట్లు దుబారా చేస్తున్న కూటమి ప్రభుత్వం కుంటి సాకులతో ప్రైవేటీకరణకు కుట్రలు పన్నుతోందన్నారు. మెడికల్ కళాశాలలో ప్రయివేటీకరణను అడ్డుకునేందుకు వైసిపి రచ్చబండ కార్యక్రమాల ద్వారా కోటి సంతకాల సేకరణను చేపడుతోందని, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రతిపక్షాల గొంతు నొక్కడం, ప్రత్యర్థులపై అక్రమ కేసులు, అరెస్టులు, వేధింపులు, దౌర్జన్యాలు, దాడులు, హత్యాకాండలతో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడంలోనూ కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. కల్తీ మద్యం తయారీని కుటీర పరిశ్రమగా చేపట్టి ప్రభుత్వ అనుమతి పొందిన మద్యం దుకాణాల్లోనే యదేచ్ఛగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ప్రభుత్వ పెద్దల ప్రమేయంతోనే కల్తీ మద్యం కుటీర పరిశ్రమగా విరాజిల్లుతోందన్నారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు శివారెడ్డి, సర్పంచ్ శ్వేత, నాయకులు నీళ్ల భాస్కర్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీమ్, ఆనంద్, రాజబాబు, కువైట్ ఇబ్రహీం, లక్ష్మీనారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, సిద్దయ్య, రవీంద్రారెడ్డి, సత్య, లవకుమార్, వెంకటస్వామి, సుధాకర్, రఘు, రవి పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్: రాష్ట్రంలోని కుటుంబ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలతోపాటు ఆరోగ్యశ్రీ ప్రయివేటీకరణ యత్నాలకు నిరసనగా తమ పార్టీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి రూరల్ మండలంలోని పెమ్మాడపల్లి, చేన్నముక్కపల్లి, దిగువ అబ్బవరం, సంబేపల్లి మండలంలోని దేవపట్ల ,రెడ్డివారిపల్లి, నాగిరెడ్డిగారిపల్లి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర, జగన హయంలోనే రాయచోటి ప్రాంతంలో అభివృద్ధి పరుగులు తీసిందన్నారు. వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్, ఝరికోన ప్రాజెక్టు నిర్మాణంతో పాటు రాయచోటి రింగురోడ్డు నిర్మాణం, పట్టణ తాగునీటి పరిష్కారం, జిల్లా కేంద్రంగా రాయచోటిని చేయడం, అన్ని గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ల నిర్మాణాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిదంబరరెడ్డి, మాజీ జడ్‌టిసి ఉపేంద్రరెడ్డి, సంబేపల్లి మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, ఎపిసిసి మాజీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి మాజీ సివిల్ సప్లైస్ డైరెక్టర పోలి సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్‌ఆర్‌సిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, ఉప సర్పంచ్ తిరుపాలు ఎంపిటిసి రామచంద్రారెడ్డి కౌన్సిలర్ నరసింహారెడ్డి మాజీ కౌంటర్ ఆనందరెడ్డి పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా ఎదగాలి : డిఇఓ



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఓ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

విపత్తులను ఎదుర్కొనేందుకు, నాయకులుగా ఎదిగేందుకు స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణం డైట్ కళాశాలలో అక్టోబర్ 25 నుంచి 31 వరకు 7 రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ శిక్షణలో రాష్ట్రస్థాయి అధికారులు పాల్గొని ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి చేర్చడం, గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల సమయంలో స్వచ్ఛందంగా సేవలందించడం వంటి విషయాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈత కొట్టడం, వంతెనలు, రోడ్డు నిర్మాణం, పట నైపుణ్యాలు, ప్రభుత్వ, ప్రజల ఆస్తులు కాపాడడం వంటి విషయాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, అర్చన విద్యాసంస్థల డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి, ఎల్‌ఓసిలు (లీడర్ ఆఫ్ ది కోర్స్) జయరాం, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, శకుంతల, అబ్జర్వర్ కమల కన్నన్, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్స్ రమణయ్య, హిమాలయన్ వుడ్ బ్యాడ్జ్ ఖాదర్ బాషా, బాలసుందరం, శివప్రసాద్, అమర్నాథ్‌బాబు, ట్రైనర్స్ లక్ష్మీకర్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, యువ ఆపదమిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లాలోని 160 మంది స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టు పనులు చేపట్టండి : పిసిసి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట

పాలకులు మారినా అన్నమయ్య ప్రాజెక్టు పరిస్థితి ఇంతేనా అని కాంగ్రెస్ పార్టీ పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య సాగునీటి ప్రాజెక్టు రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించే ప్రధానమైన ప్రాజెక్టుగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిందని, 2.20 టిఎంసిల సామర్థ్యంతో 2001 నాటికి ఐదు గేట్లతో అన్నమయ్య ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కానీ దురదృష్టవశాత్తు వైసిపి ప్రభుత్వ నిర్వహణ లోపం వల్ల, ఆకస్మిక వరదల వల్ల 2021 నవంబర్ 19న ప్రాజెక్టు తెగిపోయిందని, నీటి ప్రవాహంలో అనేక గ్రామాలు కొట్టుకుపోయాయని తెలిపారు. వైసిపి పాలనలో రూ 787.77కోట్లతో 14 గేట్లతో నిర్మించేటందుకు టెండర్లు పిలవడం జరిగిందని, రాఘవ కన్స్ట్రక్షన్స్ కంపెనీ టెండర్ దక్కించుకుందని, కానీ పనులు ప్రారంభించలేదన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ టెండర్ ను రద్దు చేసిందని, కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఉందని, అధికారంలోకి వచ్చి 16 నెలలైనా అతీగతి లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు మీద దృష్టి సారించి త్వరిత గతిన పూర్తి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గపు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పూల భాస్కర్, పిసిసి సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్, ఒంటిమిట్ట మండలాధ్యక్షులు గంటా గురవయ్య, నందలూరు మండలాధ్యక్షులు రమేష్ , రాజంపేట మండలాధ్యక్షులు తఙుకు మహదేవయ్య, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి ధీరజ్

దేశ సమైక్యతకు కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దేశ సమైక్యతకు ప్రతి ఒక్కరూ కలిసి కృషి చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను నిర్వహించి యూనిటీ రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ భద్రత, ఐక్యత కోసం తన జీవితాన్ని నిస్వార్థంతో నిజాయితీతో అంకిత భావంతో ధారపోసారని పేర్కొన్నారు. ఆయన జీవితం ఆశయాలు జాతీయ సమగ్రతకు ఎప్పుడూ స్ఫూర్తిగా నిలవాలని కోరారు. జాతీయ సమైక్యతకు జిల్లాలో ప్రతి పౌరుడూ తమవంతు కృషిచేసి దేశ రక్షణకు, అంతర్గత భద్రతకు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విధుల్లో పునరంకితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. అనంతరం యూనిటీ రన్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి, ఆర్‌టిఒ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రవికుమార్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, తహశీల్దార్ నరసింహకుమార్, రెవెన్యూ, పోలీస్, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

26వ సారి రక్తం దానం చేసిన శివకుమార్

ప్రజాశక్తి-రాజంపేట



టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ 26వసారి రక్తదానం చేశారు. శుక్రవారం రాజంపేట పట్టణానికి చెందిన మహేశ్వరి అనే గర్భిణికి శస్త్ర చికిత్స నిమిత్తం ఎబి నెగిటివ్ రక్తం కావాలని డాక్టర్లు సూచించడంతో వారి కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న శివకుమార్ శ్రీసాయి ఆసుపత్రిలో రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

నాణ్యమైన విద్యను అందించాలి : జడ్జి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని తంబళ్లపల్లి జెఎఫ్ సిఎం కోర్టు న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ తెలిపారు. తంబళ్లపల్లెలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలను జడ్జి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతి, బోధన సామర్థ్యాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందని ఆదేశించారు.

ప్రాజెక్టు అధ్యక్షులుగా రమాదేవి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రైల్వేకోడూరు ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్షులుగా రమాదేవి ఎంపికైనట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామానుజులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రైల్వేకోడూరు ప్రాజెక్టులో మహాసభ నిర్వహించమని తెలిపారు. ఈ మహాసభలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సుదీర్ఘంగా చర్చించామని పేర్కొన్నారు. అనంతరం రైల్వేకోడూరు అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. రైల్వేకోడూరు ప్రాజెక్టు నూతన అధ్యక్షులుగా రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకుమారి, కోశాధికారిగా పద్మావతి సహాయ కార్యదర్శిగా వనజను ఎన్నుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు ఆర్‌టిసి డిపోలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు ఆర్టీసీ డిపోలో విజిలెన్స్ తనిఖీలు చేపట్టారు. గురు, శుక్రవారాల్లో కడప ఆర్టీసీ జోన్ విజిలెన్స్ సహాయ మేనేజరు పెద్దరాజు తనిఖీలు చేపట్టారు. మొదటిరోజు తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండులో సౌకర్యాలు, దుకాణాలు, కార్గో కార్యాలయాన్ని తనిఖీ చేస్తూ సరకుల డెలవరీతో పాటు నిల్వ ఉన్న లగేజీలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. రెండవ రోజు శుక్రవారం గ్యారేజీలోని బస్సులు, వాటి టైరు, విభాగాలు, ఇంధన నిల్వలను, అక్కడి రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా పెద్దరాజు మాట్లాడుతూ ఆర్టీసీలో బస్సు మధ్యలో చెడిపోయినా, ప్రమాదంలో ఎవరైన మృతి చెందడం, క్షతగాత్రులు కావడం లాంటి విషయాల్లో మొదట డిపో అధికారుల బృందం ప్రమాదస్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును, అందులో డ్రైవరు తప్పు చేశాడా లేక బస్సులో సాంకేతిక లోపమా, రోడ్డు స్థితి సరిలేక ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ జరిపి ఉద్యోగిపై చర్యలు తీసుకుంటారన్నారు. అలాంటి చర్యలను కూడా విజిలెన్స్ తనిఖీలు చేసి, గ్యారేజీ సిబ్బందిలోపం ఉన్న పక్షంలో సోకాజ్ ఇస్తామని దాంతో పాటు శాఖ పరంగా శిక్షణకు పంపడంతో పాటు డ్రైవరు తప్పని తేలితే అతన్ని కూడా శిక్షణకు సంపుతారన్నారు. కొన్ని సందర్భాల్లో ఉద్యోగి ఇంక్రిమెంట్లో కోత పెట్టే అవకాశం ఉందని తెలియజేశారు. విజిలెన్సు తనిఖీలో గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, నరసింహారెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సహాయ మేనేజర్ పెద్దరాజు

సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సాంకేతిక విద్యతో విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీగుడ్ విల్ కంప్యూటర్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సి.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని చంద్రకాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఒకేషనల్ ట్రైనర్ జయనందిని ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సొసైటీ కాలనీలో గల శ్రీగుడ్ విల్ కంప్యూటర్స్ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ అజయ్‌కుమార్ కంపూటర్ ల్యాబ్‌ను విద్యార్థులకు చూపించి అందిస్తున్న కోర్సుల వివరాలు, వాటి ఉపయోగాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు అనుకున్న స్థాయిలో అందుబాటులో లేని కారణంగా సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేషనల్ కోర్సులను ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రవేశపెట్టి, విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే విద్యతో పాటు సాంకేతిక విద్యపై పట్టుసాధించేలా శిక్షణలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు శ్రీగుడ్ కంప్యూటర్స్ అత్యుత్తమ బోధన అందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు కంప్యూటర్ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటివి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల మహిళా అధ్యాపకులు హరిత కుమారి, స్వాతి, శారద, బేబీ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటికి ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 రాయచోటి ఎన్నికల బహిరంగ సభలో ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక పత్రిక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. తాజాగా మీడియా ప్రచారం మేరకు అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కాకుండా రాజంపేటకి మారుస్తున్న వార్తలు నిజం కాకుండా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చూడాలని విజ్ఞప్తి చేశారు. రాయచోటి ప్రాంత రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు ప్రజాప్రతినిధులు గళం విప్పాలని కోరారు. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణయం తీసుకోవద్దని కోరారు. ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరేంద్ర

క్రియేటివ్ ఫొటోగ్రఫీపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలోని ఫిల్మ్ మేకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రియేటివ్ ఫోటోగ్రఫీ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించామని వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ఢిల్లీకి చెందిన ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ మెంటర్, ఫ్రీలాన్సర్ వీరేంద్ర ముఖ్య అతిథిగా హాజంయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక దృక్పథాన్ని పెంపొందిం చుకోవడంతో పాటు ఫోటోగ్రఫీ పట్ల ఆసక్తిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సరైన అవగాహన, సాంకేతిక నైపుణ్యాలు నిరంతర సాధన ద్వారా మాత్రమే మంచి ఫోటోగ్రాఫర్‌గా ఎదగగలరని పేర్కొ న్నారు. ఫోటోగ్రఫీ ద్వారా విద్యార్థులు తమ భావాలను, ఆలోచనలను చిత్రాల రూపంలో వ్యక్తీకరించవచ్చని పేర్కొన్నారు. ఇది వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని అన్నారు. వర్క్‌షాప్‌లో ఫోటోగ్రఫీ ప్రాథమిక సూత్రాలు, కాంతి వినియోగం, ఫ్రేమింగ్ టెక్నిక్స్, సృజనాత్మక దృశ్యాల చిత్రీకరణపై విలువైన సూచనలు అందించారు. వీరేంద్ర అధికారి ఫోటోగ్రఫీని కేవలం అలవాటుగా కాకుండా ఒక కళారూపంగా, వృత్తిగా కూడా మలుచుకోవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ ప్రొఫెషనల్ కెమెరాల ద్వారా ప్రాక్టికల్‌గా నేర్చుకున్న నైపుణ్యాలను ప్రదర్శించగా, పోటీలలో గెలుపొందిన వారికి బహు మతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి. రామనాథన్, సాక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.రెడ్డిహేమంత, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ రియాజ్ అలీ, ఆర్ట్స్ అండ్ కల్చరల్ కో-ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో డ్రెయినేజీ పనులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రూ.35 లక్షల అంచనా వ్యయంతో మదనపల్లె పట్టణం 31వ వార్డులో సిమెంట్, మురుగు నీటి కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. టిడిపి వార్డు ఇన్‌ఛార్జి తమ్మిశెట్టి రామకృష్ణ శుక్రవారం వార్డు లో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువ నిర్మాణ పనుల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా జెసి బి సహాయంతో కాలువమట్టిని తీస్తూ వెంటనే ట్రాక్టర్లతో వేరే ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వెయ్యి మీటర్లు పొడవున రూ.35 లక్షలు అంచనా వ్యయంతో, నాణ్యతలో రాజీ పడ కుండా పనులు త్వరగా పూర్తిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తామన్నారు.


వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎఎస్ఐ

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-కలకడ

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎఎస్ఐ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడలో సిఐ లక్ష్మన్న ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి వాహనాలను నడపాలన్నారు. పరిమితికి మించిన అధిక బరువులు గల వస్తువులు వేసి వాహనాలను నడపరాదని సూచించారు. ప్రతి వాహనదారుడు వాహనములకు సంబంధించిన రికార్డులు, లైసెన్సులు, పొల్యూషన్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని తెలిపారు. ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ తలకు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనములను మైనర్లకు ఇవ్వరాదని అలా ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. వాహనములకు రికార్డులు సక్రమంగా లేనియెడల వాటికి అపరాధ రుసుంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో హారిక, పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, ప్రతాప్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి


బ్లీచింగ్, సున్నం పిచికారి చేస్తున్న కార్మికులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే విష జ్వరాలు దరి చేరవని ఎంపిడిఒ జవహర్‌బాబు, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వరప్రసాద్ అన్నారు. శుక్రవారం వీరబల్లి, పంచాయతీలో పర్యటించి ప్రజలతో మాట్లా డుతూ ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారంతో పాటు, డబ్బాలు, పాత కుండలు, పైపులు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురికినీరు ప్రవహిస్తున్న కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామ కార్యదర్శిని కోరారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో నీరు నిలిచిన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. వీరబల్లి పంచాయతీలో పారిశుద్య కార్మికులు బ్లీచింగ్, సున్నం చల్లారు. శానిటేషన్ కూడా చేయడం జరిగిందన్నారు. అనంతరం మట్లి, పెద్దివీడు, పుత్తవాండ్లపల్లి, పంచాయతీలో ఒహెచ్ఎస్ఆర్ ట్యాంక్, అండ్ క్లోరినేషన్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఇఒపిఆర్‌డి వరప్రసాద్, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, సెక్రటరీలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-వీరబల్లి

పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దివీడు, రెడ్డివారిపల్లి జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పాఠశాల విద్యార్థి ఎస్.సాయిభార్గవ్ ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు సుంకర శివయ్యపేర్కొన్నారు. 'మహిళలు, పిల్లలను లైంగిక వేధింపుల నుంచి పరిరక్షించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసర రచన పోటీలు నిర్వహించార ని తెలిపారు. ఈ పోటీల్లో సాయిభార్గవ్ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్‌పి ధీరజ్ కనుబిల్లి చేతులకు మీదు రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నాడని తెలిపారు.

సాఫ్ట్, బేస్ బాల్ క్రీడల్లో ప్రతిభ చాటిన ఆదర్శ విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు శుక్రవారం రాయచోటిలోని జడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అండర్-14,17 సాఫ్ట్‌బాల్ బాలుర విభాగంలో గోపికృష్ణ, సందీప్‌శర్మ, పి.వర్ధం యాదవ్, హర్ష అద్భుత ప్రతిభ కనబరిచారని పీడీ నీలకంఠరావు తెలిపారు. బాలికల అండర్-14 సాఫ్ట్ బాల్ విభాగంలో సుశాంతి, పుష్పలత, బాలుర బేస్ విభాగంలో అండర్-17 గోపికృష్ణ, అండర్-14 విభాగంలో సందీప్‌శర్మ, వర్దన్, బాలికల అండర్-14 బేస్ బాల్ విభాగంలో అఖిల, పుష్పలత అద్భుత ప్రతిభ చూపారని తెలిపారు. క్రీడా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపల్ లీలాశ్రీహరి ప్రత్యేకంగా అభినందించారు.

అప్రమత్తతపై అవగాహన వారోత్సవాలు

ప్రజాశక్తి-కలికిరి : అప్రమత్తతపై అవగాహన వారోత్సవాలు స్థానిక అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో కరస్పాం డెంట్ నౌషాద్ బి, ఐటిబిపి కమాండర్ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్రమత్తత మన ఉమ్మడి బాధ్యత అనే నినాదంతో అప్రమత్తత, వరకట్నంకు వ్యతిరేకంగా అవగాహన వారోత్సవాలు జరుపు కుంటు న్నా మని తెలిపారు. కార్యక్రమంలో ఐటిబిపి హెడ్ కానిస్టేబుల్ సునీల్‌కుమార్, శివశంకర్, శంకర్రావు, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలి :ఎఎస్‌పి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : విద్యార్థులు బాధ్యతతో కూడిన పౌరులుగా వ్యవహరించాలని రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే అన్నారు. శుక్రవారం సాయి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ కార్యక్రమం ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి ఉన్నత విద్య ప్రాధాన్యత లక్ష్య నిర్దేశంపై పలు సూచనలు చేశారు. గౌరవ అతిథిగా కోడూరు సిఐ కె. హేమసుందర్‌రావు పాల్గొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రదర్శిం చారు. కార్యక్ర మంలో డైరెక్టర్లు కె.చెంగల్‌రాజు, ఎస్.ఎన్. శ్రీనివాసులు, పి శ్రీనివా సులు, సిబ్బంది ఆదపాల శివకుమార్,పూర్వపు విద్యార్థి,మల్లెం హేమంత్ పాల్గొన్నారు.

60 కి.మీ. పరిధిలో టోల్ వసూళ్లా?

ప్రజాశక్తి-కలికిరి


మాట్లాడుతున్న ఉమామహేశ్వరయ్యర్

స్థానికులకు మినహాయింపు ఇవ్వకుండా టోల్‌ప్లేట్ చార్జీలు వసూలు చేయడంపై మహారాష్ట్ర మాజీ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ కె.ఎస్. ఉమా మహేశ్వరయ్యర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టోల్ ప్లాజాల నుండి 60 కి.మీ పరిధిలో నివసించే ప్రజల నుంచి ఇష్టానుసారంగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్నారనే అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రహదారులు మరియు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ, ఏదైనా టోల్ ప్లాజా నుండి 60 కి.మీ పరిధిలో నివసించే వారు ఆధార్ వంటి సరైన చిరునామా రుజువుతో టోల్ చార్జీల నుంచి మినహాయింపు పొందుతారని హామీ ఇచ్చారన్నారు. ఈ ఆదేశం అమలులో లేకపోవడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. కలికిరి పరిసర ప్రాంతాల్లోనే రెండు టోల్ ప్లాజాలు 15 కి.మీ లోపలే ఉన్నాయని, స్థానికులు మంత్రి పార్లమెంట్‌లో చేసిన ప్రకటన వీడియోను చూపించినప్పటికీ, ఆధార్ ఆధారిత చిరునామా చూపించినా టోల్ వసూలు కొనసాగుతుందని, కొన్ని సందర్భాల్లో జరిమానాలు కూడా విధిస్తున్నారని తెలిపారు. ప్రజలకు భారంగా మారిన టోల్ ప్రజలు పనులు, వైద్యం, విద్య వంటి అవసరాల కోసం తరచూ పీలేరు, కలికిరి నుండి మదనపల్లె, పీలేరు నుండి రాయచోటికి ప్రయాణాలు చేయాల్సి వస్తుందని, రెండు ప్రాంతాలకు 60 కిలోమీటర్ల లోపలే టోల్‌ప్లేట్ ఉన్న కూడా టోల్ మినహాయింపు సక్రమంగా అమలు కాకపోవడంతో వాహనదారులకు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు.దేశవ్యాప్తంగా, ముఖ్యంగా టోల్ ప్లాజా నుండి 60 కి.మీ పరిధిలో నివసించే ప్రజలకు టోల్ మినహాయింపు సక్రమంగా అమలయ్యేలా రోడ్డు రవాణా హైవే మంత్రిత్వశాఖ, ఎన్‌హెచ్ఎఐ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

అవినీతి రహితంగా 'ఉపాధి' పనులు : పీడీ

ప్రజాశక్తి- రాజంపేట



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి రహితంగా నిజాయితీగా పనులు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పారదర్శకంగా ఇకెవైసిని 100 శాతం పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం రాజంపేట మండల పరిషత్ సభ భవ నంలో రాజంపేట, నందలూరు , పుల్లంపేట, పెనగలూరు మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో పీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత పౌరుల ప్రతిజ్ఞతో కార్యక్రమాన్ని ప్రారంభించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో పౌరులు అందరూ కలిసి అవినీతిని కలిసికట్టుగా నిర్మూలిం చేందుకు తగిన చర్యలు తీసుకొని పనులు చేపట్టాలన్నారు. నూటికి నూరు శాతం జాబ్ కార్డులు ఇకెవైసి చేయడం ద్వారా సమాజంలో జవాబుదా రీత నంతో పథకాన్ని నిజాయితీగా నిర్వహించవచ్చని ఆయన సూచించారు. కూలీలకు మిగులు రోజులు పనులు కల్పించాలన్నారు. రైతుల పండ్ల తోటల పెంపకానికి లబ్ధిదారులను గుర్తించాలని, పండ్ల చెట్లు నాటి పోషిం చుకు నేందుకు రైతులుకు అవకాశం కల్పించాలన్నారు. కాటిల్ షెడ్లు, సోక్ పిట్స్, నీటి కుంటలు, సామూహిక తోటల పెంపకం, రోడ్డుకి ఇరువైపుల చెట్లు నాటే కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ నరసింహమూర్తి, అసిస్టెంట్ పథక సంచాలకులు, ఎపిడి సన్నపునేని మృత్యుంజయరావు, రాజంపేట ఎంపిడిఒ పి.వరప్రసాద్, నంద లూరు ఎంపిడిఒ ప్రసాద్, పెనగలూరు ఎంపి డిఒ విజయరావు,ఎపిఒలు టెక్ని కల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పారదర్శకంగా పనులు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఇకెవైసి వందశాతం పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం కోడూరు మండల పరిషత్ సభ భవనంలో కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో పీడీసమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత పౌరుల ప్రతిజ్ఞతో కార్యక్రమాన్ని ప్రారంభించి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ రంగం పౌరులు అందరు కలిసి అవినీతిని కలిసికట్టుగా నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకొని పనులు చేపట్టాలన్నారు. రైతుల పండ్ల తోటల పెంపకానికి లబ్ధిదారులను గుర్తించాలని, గుర్తించిన లబ్ధిదారులకు పండ్ల చెట్లు నాటి పోషించుకునేందుకు రైతులుకు అవకాశం కల్పించాలన్నారు. కాటిల్ షేడ్స్, సోక్ పిట్స్, నీటి కుంటలు, సామూహిక తోటల పెంపకం, రోడ్డుకి ఇరువైపుల చెట్లు నాటే కార్యక్రమాలను తదితర కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. రైతాంగానికి ఎక్కువగా ఉపయోగపడే పనులను గుర్తించి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట అసిస్టెంట్ పథక సంచాలకులు సన్నపునేని మృత్యుంజయరావు, స్థానిక ఎంపిడిఒ నాగిరెడ్డి, కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి మండలాల ఎపిఒలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలి


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్‌బాబు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లెలోని జడ్‌పి హైస్కూల్‌ను శుక్రవారం ఎంపిడిఒ రమేష్‌బాబు, సమగ్ర శిక్ష అభయాన్ ఎఇ నాగభూషణం, పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కొమ్మిరెడ్డిగారిపల్లెలో గతంలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాల 2025-26 విద్యా సంవత్సరం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా విద్యాశాఖ ఉన్నతీకరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల భవనం పైకప్పు నుంచి నీరు ఉరుస్తోందని హెచ్‌ఎం శ్రీదేవి సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పాఠశాల భవనానికి మరమ్మతు పనులను వెంటనే చేపట్టడానికి ప్రాథమిక అంచనా సిద్ధం చేసి పనులను ప్రారంభించాలని సూచించినట్లు చెప్పారు. విద్యార్థుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాణాలు బలవుతున్నా పట్టని ప్రభుత్వం :'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


దెబ్బతిన్న రోడ్లకు కొలతలు వేస్తున్న వైసిపి నాయకులు

కడప నుంచి తిరుపతికి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్లన్నీ గుంతల మయమై ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు బలవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం పోడు ఉప్పరపల్లె ప్రాంతంలో గుంతల మయంగా ఉన్న ప్రధాన రహదారిని కార్యకర్తలతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం తిరుపతిలోని ఆసుపత్రులకు, తిరుమలకు, చెన్నైకు పలు దేవాలయాలకు,వెళ్లే ప్రధాన రహదారి అయిన కోడూరు నుంచే వెళతాయన్నారు. కోడూరు నుంచి రోడ్లు గుంతలమయమై మరింత అధ్వానంగా ఉందన్నారు. ప్రయాణికులకు ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ప్రాణాలు పోయినా ఈ కూటమి ప్రభుత్వానికి ఎటువంటి చలనం లేదన్నారు. ఉప్పరపల్లి నుంచి మాధ వరంపోడు, జ్యోతినగర్ వరకు నడుచుకుంటూ వచ్చి టేపుతో కొలతలు వేసి ఒక్కో గుంత 15 అడుగుల పొడవు 4 అడుగుల వెడల్పుతో ఉందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో ఇటువంటి సమస్యను అప్పుడే గ్రహించి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులతో కలిసి అనేకమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రిని కలిసి రూ.2700 కోట్లతో కడప నుంచి రేణిగుంట వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవే మంజూరు చేయించుకోగా తర్వాత ఎన్నికల రావడం ప్రభుత్వాలు మారి కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న పనులు మొదలు పెట్టకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఇప్పటికైనా తాత్కాలికంగా గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివసాయి, మందల నాగేంద్ర, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నంద బాల, సర్పంచ్ ఈశ్వరయ్య యాదవ్, శ్రీరామ్‌వినోద్, ఎంపిటిసి బండారు మల్లికార్జున, మాజీ జడ్‌పిటిసి రాజేశ్వరమ్మ, అరుణమ్మ, రాజగోపాల్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- కలకడ

చెత్త నుంచి సంపద తయారు చేయు కేంద్రాన్ని డిపిఒ లక్ష్మీపతి పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడ బాట్వారిపల్లి పంచాయతీలలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ఈ చెత్త నుండి సంపద తయారు చేయు కేంద్రాలను పరిశీలించి ఎన్‌ఎడిఇపి పిట్ లలో కూరగాయలు, ఆకుకూరలు, మొక్కలను గమనించి ఈ విధానాన్ని అన్ని పంచాయతీలలో అమలు చేయమని చెప్పారు. బాటవారిపల్లె గ్రామపంచాయతీలో ఒహెచ్ఎస్ఆర్ పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి నీటి పరీక్షలు నిర్వహించారు.నీటి పరీక్షల ఫలితాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నీరు తాగడానికి అనుకూలంగా ఉందని తెలిపారు. బాటవారిపల్లి పంచాయతీలో శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్న , జావేద్, పంచాయతీ కార్యదర్శి నందిని, శైలజ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రుచిత, ఎంపిడిఒ బిల్‌కలెక్టర్, గ్రీన్ అంబాసిడర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తపేట జడ్‌పిహైస్కూల్‌లో ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిం చిన ప్రాజెక్టు వర్క్ పోటీలలో అద్భుత ప్రతిభ ఘనపరిచిన ఆరుగురు విద్యార్థులకు పాఠశాల ప్రధానో పాధ్యాయులు అలీ అక్బర్ చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి జూనియర్స్ విభాగంలో పోస్ట్ ఆఫీస్, ఫైర్ స్టేషన్, బ్యాంకు, సీనియర్స్ విభాగంలో ప్రభుత్వ ఆస్పత్రి, బిఎస్‌ఎన్ఎల్ కార్యాలయం, సచివాలయం, పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన ప్రాజెక్టు తయారు చేసుకొని రావలసి ఒదిగా సైన్స్ ఉపాధ్యాయులు డివి సుబ్బారెడ్డి విద్యార్థులకు సలహాలు సూచనలు తెలిపారు.

పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- రిలే నిరాహార దీక్షకు ముస్లిం మైనార్టీల మద్దతు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ ప్రజా, విద్యార్థి సంఘాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ముస్లీం మైనారిటీలతో పాటు వైసిపి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా మద్దతు పలికారు. పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్, షౌకత్ అలీ, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర చక్రధర్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత తేజ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనను ఎలా చేపట్టారో, అదే పరిపాలనా సౌలభ్యం కోసం డివిజన్ కేంద్రాల ఏర్పాటు కూడా చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. పీలేరు మండలానికి మదనపల్లి డివిజన్ కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరం ఉందని, గతంలో కూడా ఈ ఇబ్బందిని ఈ మండల ప్రజలు అనుభవించారని, ఇప్పుడు రాయచోటి డివిజన్ కేంద్రానికి కూడా 60 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిచేసే క్రమంలో కూటమి ప్రభుత్వం మా మనోభావాలను, సౌకర్యాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీలేరు రెవెన్యూ డివిజన్ కేంద్రం ప్రకటించే విషయంలో స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్పందించి తమకు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ నడిమి కంద్రిక సుధాకర్, ముస్లీం మత పెద్దలు, ఎండిపిఎస్ రాష్ట్ర నాయకులు ముల్లంగి చంద్రయ్య, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు తుమ్మల ధరణి కుమార్, గుర్రం నారాయణ, చీకటిపల్లి రామాంజులు, బిసి హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ ఎద్దుల మహేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, డిబిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు బద్దే భాను ప్రకాష్, వైసిపి విద్యార్థి విభాగం నాయకులు మాలతోటి నరేష్, దళిత నాయకులు తిమ్మయ్య,ప్రసాద్, వగళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి వీరబల్లి : వీరబల్లి, వంగిమళ్ళ, డి. రాచపల్లి, పశు వైద్య ఆసుపత్రులను శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాల కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంగిమళ్ళ, డి.రాచపల్లి రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి, అనంతరం వీరబల్లి పశు వైద్య ఆసుపత్రుల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. పశు వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పశువైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలన్నారు. మండలంలోని సోమవరం పంచాయతీ వడ్డేపల్లిలో రైతు వెంకటేశ్వర్లు పందుల పెంపకం ఫారంనుజిల్లా పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పిళ్ళై పరిశీలించారు. తుఫాన్ వలన వ్యాధుల బారిన పడకుండా పశు బృందం వెళ్లి సరియైన మెలకువలు రైతుకు తెలిపారు. ఆయన వెంట స్టాటిస్టిక్స్ ఉపసంచాలకులు డాక్టర్ లోకేష్, డాక్టర్ లక్ష్మీనారాయణ, మండల పశువైద్యులు డాక్టర్ గణేష్, పశు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ భారతదేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. రెడ్డీ సాహెబ్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ 41వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తని కొనియడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మీనాకుమారి, డాక్టర్ ఎస్కే. బాషా, ముబారక్ ఖాన్, సోమశేఖర్, శరత్ కుమార్ రెడ్డి, రవీంద్ర, ఈశ్వరమ్మ, మహమ్మద్ అలీ, మహబూబ్ పీర్, నాగరాజు పాల్గొన్నారు.**వీరబల్లి :**దివంగత ప్రధాని ఇందిరాగాంధీ భారత దేశానికి చేసిన సేవలు ఎనలేనివని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి కొనియాడారు.ఇందిరమ్మ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టె, ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంచి పెట్టారు.సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో రాణించిన ఇందిరా గాంధీ భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జియావుల్లా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-రామాపురం : ఎయిడ్స్, హెచ్ఐవిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రజా చైతన్య సేవా సంఘం ఒఆర్ డబ్ల్యు విజయలక్ష్మి, సుహాసినిలు పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట జడ్‌పి హైస్కూల్ (తెలుగు మీడియం)లో శుక్రవారంఎయిడ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యార్థి దశనుండే ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించుకోవాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి అంటించుకునే వ్యాధి తప్ప అంటు వ్యాధి కాదన్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా రక్త మార్పిడి వ్యాధి సోకిన వ్యక్తికి ఉపయోగించిన సిరంజులు పక్కవారికి ఉపయోగించినా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. టిబి వ్యాధి లక్షణాలు నివారణ తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి, పిఇటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న తల్లెం భరత్

రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-రాజంపేట

అమృత సంవాదం క్రింద ఎంపికైన రాజంపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ప్రయాణికులకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని గుంతకల్లు రైల్వే డిఆర్‌సిసి సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేటలో రైల్వే అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లా డుతూ రాజంపేట రైల్వేస్టేషన్‌లో అమృత సంవాదం కింద తొలి విడతలో విడుదలైన సుమారు రూ.20 కోట్ల నిధుల ద్వారా రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటరు, లిఫ్టు, నీటి కుళాయిల సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. టికెట్ కౌంటర్‌లో అదనంగా ఒక సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒం టిమిట్ట రామాలయం పుణ్యక్షేత్రంలో ప్లాట్‌ఫాం షెల్టర్, అదనపు స్టాపేజస్ కల్పించాలన్నారు. అనంతరం రైల్వే కోడూరు ఆర్చి, అండర్ ప్రాసెస్ బ్రిడ్జిల నందు విద్యుదీకరణ, సిసి కెమెరాలు ఏర్పాటు, సన్ రూప్, ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం, వైద్య సదుపాయం కొరకు విఎంసి ఆస్పత్రి ఏర్పాటు, సులువుగా ప్రయాణించుటకు గుంటూరు ఎక్స్‌ప్రెస్ తిరువన్నామలైకు పొడిగించాలన్నారు. కార్యక్రమంలో రైల్వే సీని యర్ డి.ఎన్ సుదర్శన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రాజగోపాల్ రెడ్డి, ఎలక్ట్రికల్ డిఇ శ్రీనివాసులు, ఎడిఎస్ వాసుదేవనాయుడు, జిల్లా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ సనిసెట్టి నవీన్ కుమార్, సిసి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

హజ్‌హౌస్‌కు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర రాజధాని అమరావతిలో హజ్ యాత్రికల కోసం హజ్ హౌస్ నిర్మాణానికి సిఆర్‌డిఎ పరిధిలో ఐదు ఎకరా స్థలం కేటాయించాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు శుక్రవారం సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ పఠాన్ ఖాదర్ ఖాన్ మాట్లాడుతూ మక్కా మసీదు యాత్ర కోసం రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి బయలుదేరాల్సిన పరిస్థితి ఉందన్నారు. అమరావతిలో హజ్‌హౌస్ నిర్మాణం కోసం సిఆర్‌డిఎ పరిధిలో ఐదు ఎకరాల స్థలం కేటాయించి ఇక్కడి నుంచే మన రాష్ట్ర ముస్లిం మైనార్టీలు మక్కా యాత్రకు వెళ్లేందుకు మార్గం సుగుమం చేయాలని సిఎంను కోరినట్లు తెలిపారు. సిఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

న్యాయం చేసి ఆదుకోండి

ప్రజాశక్తి-రాజంపేట

60 సంవత్సరాలకు పైగా తమ అనుభవంలో ఉన్న పట్టా జాగాను కాజేసేందుకు కొందరు పెద్దలు దౌర్జన్యానికి దిగుతున్నారని, తమకు న్యాయం చేయాలని రాజంపేట పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ కు చెందిన పొదిలి సాలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో పాత్రికేయులను ఆశ్రయించి ఆమె తన గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా బాధితురాలు సాలమ్మ మాట్లాడుతూ పుల్లంపేట ఎస్.బి.వి.డి.పాఠశాలకు సమీపంలో 60 సంవత్సరాలకు పైగా సర్వే నెంబరు 262 లో తన బావ పొదిలి మంగయ్య పేరిట ఉన్న 175 చదరపు గజాల స్థలాన్ని తన బావకు సంతానం లేకపోవ డంతో భర్త మృతి చెందడం వల్ల తన పేరిట 20 ఏళ్ల క్రితం రిజిస్టర్ చేయించారని తెలిపారు. నాటి నుండి అక్కడే రేకుల ఇల్లు నిర్మించుకొని విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నుతో పాటు ఇతరత్రా పనులు చెల్లించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ వర్షాల కారణంగా రేకుల ఇల్లు కూలి పోవడంతో తిరిగి పునర్నిర్మాణం చేద్దామని చూస్తే పుల్లంపేట మండలంలో పేరుగాంచిన ఎస్‌బివిడి పాఠశాల కరస్పాండెంట్ శ్రీరాములయ్య ఆ జాగా తనదేనంటూ తమపై దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ సమస్యపై కలెక్టర్ ను కూడా ఆశ్రయించామని, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా పుల్లంపేట తహశీల్దార్ కు బదిలీ చేస్తే వారు సర్వేయర్ ను పంపారని, సర్వేయర్ కూడా అవతలివారికి అను కూలంగా వ్యవహరిస్తున్నారని విలపించారు. ఆర్థిక, అంగ బలంతో పాఠశాల కరస్పాండెంట్ తమను బెదిరించి తమ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని, ఇందుకు స్థానికంగా ఉన్న సర్వేయర్, విఆర్ఒ , ఇద్దరు పాత్రికేయులను తమపై ఉసిగొలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ దిక్కులేని దళితులైన తమకు న్యాయం చేయాలని బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నీరుమున్నీరయ్యారు. పెద్దోళ్ల బెదిరి ంపులతో చేసేదేమీ లేక తమ వారంతా అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నారని, ఏ ఆసరాలేని తమను ప్రభుత్వమే ఆదుకొని న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

జిల్లా ప్రచార కార్యదర్శిగా అజ్మతుల్లా

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సామన్య కార్యకర్త అయిన తనను వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శిగా నియమించినట్లు పఠాన్ అజ్మతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై ఎంతో నమ్మకంతో పార్టీ ప్రచార బాధ్యతలను అప్పగించినందుకు గత ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అభివృద్ధి గురించి ప్రచారాన్ని ప్రజలలో తీసుకెళ్తూ, అన్ని నియోజక వర్గాలలో నా వంతు కృషి చేస్తానని చెప్పారు. నాకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయురాలు రేవతి

ప్రజాశక్తి - రైల్వే కోడూరు : మండలం పరిధిలోని ఆర్.రాచపల్లి జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు మండల స్థాయి భారత రాజ్యాంగం దినోత్సవ పోటీల్లో ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు సివి. సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలలో యం.మౌనిక మొదటి స్థానం, బి. పల్లవి రెండవ స్థానం పి.పూజిత మూడవ స్థానం సాధించారని చెప్పారు. విజేతలకు ఉపాధ్యాయురాలు తలపల రేవతి అభినందనలు తెలిపారు.

వ్యక్తిపై వడ్డీ వ్యాపారి దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వ్యక్తిపై వడ్డీ వ్యాపారి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొండామర్రిపల్లి పంచాయతీ, ఇసుకనూతిపల్లికి చెందిన శ్రీనివాసులు భార్య పద్మావతి స్థానికంగా ఉన్న రవి అనే వ్యక్తి వద్ద వడ్డీకి డబ్బులు తీసుకుందన్నారు. సకాలంలో డబ్బులు చెల్లించలేకపోవడంతో రవి గురువారం పద్మావతిని పరుష పదజాలంతో దూషించి, అవమానపరిచాడని చెప్పారు. తీవ్ర మనస్థాపానికి గురైన పద్మావతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భార్య ఆస్పత్రి పాలు కావడంతో శ్రీనివాసులు శుక్రవారం రవి వద్దకు వెళ్లి అందరి ముందు అవమానకరంగా ఎందుకు మాట్లాడావని, నీ డబ్బులు కాస్త ఆలస్యమైన చెల్లిస్తామని నిలదీశాడు. రెచ్చిపోయిన రవి డబ్బులు చెల్లించకపోగా తిరిగి నాకే ఎదురు మాట్లాడతావా అంటూ శ్రీనివాసులుపైదాడి చేసి చితకబాదాడని తెలిపారు. స్థానికులు అడ్డుకొని గాయపడిన బాధితున్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.